ప్రజాశక్తి

గురువారం 15 ఫిబ్రవరి 2024 5 అనంతపురం

బాలోత్సవం ముగింపు కార్యక్రమంలో ప్రసంగిస్తున్న బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కుష్బు కొఠారి

బాలోత్సవం.. అభినందనీయం..!

బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కుష్బుకొఠారి

పిల్లల్లో దాగున్న ప్రతిభతోపాటు సృజనాత్మకతను వెలికితీయడానికి బాలోత్సవం ఎంతగానో ఉపయోగపడుతుందని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అని బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కుష్బు కొఠారి తెలిపారు. బాలోత్సవ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆమె పిల్లలకు సందేశమిచ్చారు. మూడు రోజులపాటు ఇంత చక్కటి వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఇటువంటి పోటీల ద్వారా విద్యార్థుల్లో దాగున్న ప్రతిభతోపాటు, సృజనాత్మకతను వెలియతీయడానికి దోహదం చేస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమం అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ అధ్యక్షులు షమీమ్ షఫీవుల్లా, కార్యదర్శి సావిత్రి, కోశాధికారి జిలాన్, సభ్యులు శ్రీనివాసరావు, రిటైర్డు డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, రిటైర్డు తహశీల్దారు జయరామప్ప, మానవతా రక్తదాతల సంస్థ ప్రతినిధి తరిమెల అమర్‌నాథరెడ్డి, అపెక్స్ అధినేత తిరుపాల్, కేర్ అండ్ క్యూర్ వైద్యులు అభిలాష్, యుటిఎఫ్ నాయకులు నాగేంద్ర, కోటేశ్వరరావు, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

చెప్పలేనంత సంతోషం.. మాటల్లో వర్ణించలేనంత ఆనందం... చూసిన ప్రతి ఒక్కరూ మెచ్చుకునేంత అద్భుతం.. మదిలో చెదిరిపోని జ్ఞాపకం... పిల్లల ఆనందాల హరివిల్లు బాలోత్సవంలో ఆవిష్కృతం..!

ఆట పాటలతో మెప్పించారు.. వైజ్ఞానిక ప్రదర్శనలతో ఆలోజింపజేశారు... అందరినీ ఆకట్టుకునేలా ప్రతిభను బయటకు తీశారు.. తమకు అవకాశం ఇస్తే ఏమైనా చేయగలం అని 'బాల'చిచ్చరపిడుగులు నిరూపించారు..! ఉరిమే ఉత్సాహంతో మూడు రోజుల పాటు 'అనంత'పండుగను తీసుకొచ్చిన పిల్లలు ఈ ఏడాదికి సెలవిచ్చి, మళ్లీ ఏడు కలుద్దాం అంటూ బాలోత్సవానికి వీడ్కోలు పలికారు. బాలల సృజనాత్మక మేళవింపుగా సాగిన అనంత బాలోత్సవాలు బుధవారం ముగిశాయి. మూడు రోజుల పాటు అనంత కేంద్రంగా జరిగిన ఈ పిల్లల పండుగ ప్రతి మదిలోనూ చెదిరిపోని జ్ఞాపకంగా మిగిలింది.

అద్భుతం బాలోత్సవం..

మది ని(ప)ండుగ జ్ఞాపకం.!

వేషధారణలో ఉన్న పిల్లలతో యుటిఎఫ్, సిఐటియు నాయకులు

◆ మూడు రోజుల పాటు అలరించిన పిల్లలు

◆ ఆర్ట్స్ కళాశాల ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో పండుగ శోభ

◆ ఆరు వేల మంది విద్యార్థుల భాగస్వామ్యం

◆ ప్రతిభ కనబరిచిన వారందరికీ బహుమతులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'అనంత బాలోత్సవ' సంబరం ముగిసింది. మూడు రోజులుగా అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానం పిల్లల ఆటపాటలతో సందడి కొనసాగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలను చాటుకునేందుకు పోటీపడ్డారు. వారిని ప్రోత్సహించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆరాటపడ్డారు. నిత్యం చదువుల్లో మునిగితేలే విద్యార్థులకు ఈ మూడు రోజుల ఆటవిడుపు వారిలోనూ నూతనోత్సహాన్ని నింపింది. ఈ ఉత్సహం పిల్లలోనే కాకుండా వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల్లో సైతం కన్పించింది.

ఆఖరి రోజు మరింత ఉత్సాహంగా

బాలోత్సవం ఆఖరిరోజు మరింత ఉషారుగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రెండు వేల మందికి పైగా విద్యార్థులు వివిధ రకాల ప్రదర్శనాల్లో పాల్గొన్నారు. చివరి రోజు నృత ప్రదర్శనలతోపాటు మట్టితో బొమ్మలు తయారు చేయడం, కర్రసాము, ముఖాభినయం నాటకీకరణ జానపద నృత్యం, కొలాటాల ప్రదర్శనలు జరిగాయి. ఈ ఒక్క రోజే సుమారు రెండు వేల మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తంగా మూడు రోజుల ఉత్సవాల్లో 135 పాఠశాలల నుంచి సుమారు ఆరు వేల మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొని వారి ప్రతిభను చూపారు. 64 ఇవెంట్స్‌లో పిల్లలు పాల్గొన్నారు.

బాలోత్సవంలో చిన్నారుల ప్రదర్శన

బాలోత్సవం వద్ద భోజనాలు చేస్తున్న పిల్లలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

చేనేతలకు అండగా టిడిపి

చేనేత కార్మికురాలితో మాట్లాడుతున్న భువనేశ్వరి

సంజీవపురం గ్రామంలో ముళ్లగిరి వెంకటరాముడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న భువనేశ్వరి

◆ విజ్ఞతతో ఆలోచించి ఓటేయ్యండి

◆ చేనేత మహిళల ముఖామఖిలో నారా భువనేశ్వరి

◆ ధర్మవరం, బత్తలపల్లిలో పర్యటన

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్, బత్తలపల్లి

చేనేతలకు అండగా నిలిచిన పార్టీ టిడిపి అని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి తెలిపారు. నిజం గెలవాలి పేరుతో నారా భువనేశ్వరి చేపట్టిన రాష్ట్ర వ్యాప్త యాత్రలో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లాలో 2వ రోజు ఆమె పర్యటించారు. ధర్మవరం నియోజకవర్గంలోని బత్తలపల్లి, ధర్మవరం పట్టణాల్లో బుధవారం పర్యటించి, పలు కుటుంబాలతో మాట్లాడారు. బత్తలపల్లి మండలం సంజీవపురం గ్రామంలో ఏర్పాటుచేసిన మహిళల ఆత్మీయ సమావేశం, ధర్మవరం పట్టణంలో చేనేత కుటుంబాలతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను తెలుసుకున్నారు. సంజీవపురం గ్రామంలో ముల్లగూరు వెంకటరాముడు, సాకే చెక్కీరయ్య ఇళ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తనవంతు సాయంగా ఒక్కొక్కరికి రూ.3లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ధర్మవరం మారుతీరాఘవేంద్రస్వామి కల్యాణ మండపంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాలశ్రీరామ్ ఆధ్వర్యంలో చేనేత మహిళలతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నారా భువనేశ్వరి మాట్లాడుతూ చేనేత పరిశ్రమ అభివృద్ధికి మొదటి నుంచి తెలుగుదేశం పార్టీ కృషి చేస్తోందన్నారు. అన్ని రకాల సబ్సిడీలను నేతన్నలకు తెలుగుదేశం ప్రభుత్వంలో అందిచామని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే చేనేతలకు మరిన్ని సంక్షేమపథకాలు అందిస్తారన్నారు. రాష్ట్రానికి మంచి జరగాలంటే జరగాలంటే రానున్న ఎన్నికల కురుక్షేత్రంలో మహిళలు ఓటు అనే అయుధంతో టిడిపికి మద్దతు తెలిపి వైసిపిని ఓడించాలని పిలుపునిచ్చారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ చేనేతలు ఎదుర్కొంటున్న కష్టాలను తెలుసుకునేందుకు నారాభువనేశ్వరి ధర్మవరం విచ్చేశారన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే చేనేతలను మరింత ప్రోత్సాహం అందించేందుక నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌లు కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, టిడిపి జిల్లా అధ్యక్షుడు బికె.పార్థసారధి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ, గోనుగుంట్ల విజయ్‌కుమార్, పరిటాల జ్ఞాన, బండారు శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్యకు నివాళి

దామోదరం జంజీవయ్యకు నివాళులు అర్పిస్తున్న జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రి, తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్యకు అనంతపురం కలెక్టరేట్లో అధికారులు ఘన నివాళులు అర్పించారు. బుధవారం నాడు అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో దామోదరం సంజీవయ్య 103వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య 1921 ఫిబ్రవరి 14వ తేదీన కర్నూలు జిల్లా కల్లూరు మండలంలోని పెద్ద పాడులో ఒక దళిత కుటుంబంలో జన్మించార న్నారు. ఆయన రాష్ట్ర మంత్రిగా, ఆంధ్ర రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రిగా సేవలు అందించారని కొని యాడారు. చిన్న వయసులో ముఖ్యమంత్రి అయిన ఘనత ఆయనకే దక్కింద న్నారు. నిజాయితీగా ప్రజలకు సేవలందించడంతో పాటు ప్రజాహిత పాలన కోసం అనేక సంస్కరణలు అమలుచేసి అందరి మన్ననలను పొందారన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదన్ రావు, డీఆర్డీఏ పీడీ నరసింహా రెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి, బిసి వెల్ఫేర్ డిడి ఖుష్బు కొఠారి, ఆల్ ఇండియా రేడియో ప్రోగ్రాం స్టేషన్ డైరెక్టర్ నాగేశ్వర రెడ్డి, మైనార్టీ సంక్షేమ శాఖ ఎడి రామసుబ్బారెడ్డి, మార్కెటింగ్ ఎడి చౌదరి, క్రిస్టియన్ మైనారిటీ అధికారి మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

డీజిల్ దొంగలెవరో చర్చకు సిద్ధమా?

ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

మున్సిపాలిటీలో వారే డీజిల్ దొంగలించి తమపై ఆరోపణలు చేయడం తగదని, డీజిల్ వినియోగంపై మీ ఇంటి వద్దే బహిరంగ చర్చకు సిద్ధమా అని మున్సిపల్ ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డికి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సవాల్ విసిరారు. ఎమ్మెల్యే బుధవారం పట్టణంలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రికార్డులను పరిశీలిస్తే డీజిల్ దొంగలెవరో తెలుస్తుందన్నారు. పది మంది అధికారులు పదేళ్ల నుంచి 32 ఏళ్లుగా మున్సిపాలిటీలోనే పాతుకుపోయి ఛైర్మన్ దొంగల ముఠాలో సభ్యులుగా కొనసాగుతున్నారని విమర్శించారు. మున్సిపల్ ఛైర్మన్ లేడనే భావనతో ప్రజలు నాకు ఫోన్లు చేసి వారి సమస్యలు తెలుపుతున్నారన్నారు. నా దగ్గర దొంగలెవరూ లేరని, పెద్ద దొంగ ఛైర్మన్ కాబట్టి దొంగలందరూ ఆయన దగ్గరే ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికలలో ఛైర్మన్ ఓటమిపాలైతే తాడిపత్రిలో నివాసం ఉండడని, నేను ఓడినా, గెలిచినా తాడిపత్రిలోనే ఉంటానన్నారు. నేను ఎమ్మెల్యే అయిన తర్వాత నియోజకవర్గంలో ఎక్కడా ఫ్యాక్షన్ గానా, గొడవలు గానీ లేవన్నారు. ఎంతోమంది గ్యారెంటీ ఇస్తే ఛైర్మన్ ఇప్పుడు బయట తిరుగుతున్నాడని, ఛైర్మన్ కుమారుడు ప్రజలకు ఏమి గ్యారెంటీ ఇస్తారని ఎద్దేవా చేశారు.

'కాలవ'కు పోలీసుల ముందస్తు నోటీసు

'ఆసరా'కు వెళ్లకుండా అడ్డగింత

ప్రజాశక్తి-రాయదుర్గం

గుమ్మఘట్టలో బుధవారం నిర్వహించే 'వైఎస్ఆర్ ఆసరా' ప్రోగ్రాంకు వెళ్లకుండా టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులును పోలీసులు ముందస్తు నోటీసు ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యేగా మెట్టు గోవిందరెడ్డి వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమానికి హాజరయ్యే పక్షంలో తాను కూడా మాజీ ఎమ్మెల్యేగా హాజరవుతానని కాలవ సిఐ శ్రీనివాసులకు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమానికి హాజరు కాకూడదని హెచ్చరిస్తూ సిఐ కాలవకు ముందస్తు నోటీసు అందజేశారు. కాలవతో పాటు డి.హీరేహాల్ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి ఉన్నారు.

పోలీసుల తీరుపై 'కాలవ' ఆగ్రహం

నిబంధనలకు విరుద్ధంగా మెట్టు గోవిందరెడ్డి ప్రభుత్వ కార్యక్రమాల్లో అతిథిగా ఎలా పాల్గొంటు న్నారో సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కాలవ శ్రీనివాసులు ప్రశ్నించారు. ఇటీవలే ప్రభుత్వం అతడిని ఎపిఐఐసి ఛైర్మన్ పదవి నుంచి తొలగించిందని గుర్తుచేశారు. నియోజక వర్గంలో ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో నిబంధనలు పాటించకుండా, వెలుగు అధికారులు ఏక పక్షంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. 'వైఎస్ఆర్ ఆసరా' కార్యక్రమంలో మెట్టు మహిళా సంఘా లకు చెక్కులు ఎలా పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. ఎటువంటి ప్రొటోకాల్ లేని 'మెట్టు'ని ప్రభుత్వ కార్యక్రమాలకు ఎలా ఆహ్వానిస్తారని నిలదీశారు. గుమ్మఘట్టలో జరిగే 'వైఎస్ఆర్ ఆసరా' కార్యక్రమంలో పోలీసులు నోటీసు ఇవ్వడాన్ని ఆయన ఓ ప్రకటనలో తీవ్రంగా తప్పుపట్టారు. జిల్లా కలెక్టర్ స్పందించి ప్రొటోకాల్‌ను విస్మరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కాలవ డిమాండ్ చేశారు.



నోటీసులపై పోలీసులతో మాట్లాడుతున్నకాలవ శ్రీనివాసులు

వాల్మీకులు అన్ని రంగాల్లో రాణించాలి

ఎంపీ తలారి రంగయ్య, జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

వాల్మీకులు అన్ని రంగాల్లో అభివద్ధి చెందాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయగిరిజమ్మ పిలుపునిచ్చారు. బుధవారం నాడు కళ్యాణదుర్గం మండల పరిధిలోని పింజరి కొట్టాల గ్రామంలో వాల్మీకి విగ్రహాన్ని ఎంపీ తలారి రంగయ్యతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకులు విద్యపై శ్రద్ధ పెట్టి పిల్లల్ని బాగా చదివించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిప్పేస్వామి, రామ్మోహన్, సూరి పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ ఎంపీ రంగయ్య

ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి

జెఎసి ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి ఉద్యోగుల జెఎసి ఆధ్వర్యంలో బుధవారం నాడు జిల్లాలో నిరసన కార్యక్రమాలు జరిగాయి. పలు కార్యాలయాల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతపురం తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఉద్యోగ జెఎసి, పెన్షనర్ల సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేస్తోందన్నారు. 12వ పిఆర్‌సి కమిషన్ వేసినప్పటికీ దానికి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి ప్రగతీ లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మధ్యంతర భతి(ఐఆర్) 30 శాతం పెంచాలన్నారు. సరెండర్ లీవ్‌ల ఎన్‌క్యాష్‌మెంట్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, 11వ పిఆర్‌సి, డిఎ, టిఎ బకాయిలకు సంబంధించి అన్ని సమస్యలనూ వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి భవిష్యత్తులోనూ దశలవారీగా ఆందోళనలు కొనసాగించనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జిఒ సంఘం నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, ఎస్‌టియు అధ్యక్షులు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు, ఎపిటిఎఫ్ 1938 అధ్యక్షులు రవికుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, ఎపిటిఎఫ్ 257 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి .నరసింహులు, అధ్యక్షులు వెంకటేష్, కార్యదర్శి సిరావుద్దీన్, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దన్న గౌడ్, కార్యదర్శి జయరామప్ప తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు వినతిపత్రం అందిస్తున్న జెఎసి నాయకులు

పేరుకుపోయిన ఫైళ్లు..!

◆ అనంత కార్పొరేషన్‌లో విచిత్ర పరిస్థితి

◆ బోగస్ ఫైళ్లూ ఉన్నాయనే సందేహాలు

◆ సంతకాలు చేయడంలో నూతన కమిషనర్ సందిగ్ధం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో అభివద్ధి పనులకు సంబంధించి ఫైళ్ల క్లియరెన్స్ ఎక్కడేవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా నిలుస్తోంది. కార్పొరేషన్‌లో జరిగే అభివృద్ధి పనులు తక్కువే అయినా ఫైళ్లు మాత్రం అధికంగా వస్తున్నాయనే వాదన బలంగా విన్పిస్తోంది. పనులు చేయకుండానే ఫైళ్లను పంపుతున్నారా అనే వాదన కూడా ఉంది. కార్పొరేషన్‌లో పనిచేసే కొందరు అధికారులు బోగస్ ఫైళ్లను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. కొందరు ఆపరేటర్లు ఇలాంటి వ్యవహారాలకు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన మేఘ స్వరూప్ ఐఎఎస్ శిక్షణ పూర్తి చేసుకుని అనంతపురం కార్పొరేషన్ విధులకు కొత్తగా వచ్చారు. ఆయన విధులుకు కొత్త కావడంతో పాలనాపరమైన అంశాలను అవగాహన చేసుకునే పనిలో పడ్డారు. ఒక్కసారిగా పెద్ద సంఖ్యలో ఉన్న ఫైళ్లపై ఆయన సంతకం చేసేందుకు తటపటాయిస్తున్నారు. పూర్తిగా వాటిని చూడనిదే సంతకం చేస్తే ఎలాంటి సమస్య వస్తుందో అన్న భావనలో ఆయన ఉన్నట్లు సమాచారం. ఒక వేళ కమిషనర్ అన్ని ఫైళ్లను పరిశీలిస్తే బోగస్ ఫైళ్ల వ్యవహారం వెలుగులోకి వచ్చే అవకాశం కన్పిస్తోంది. నకిలీ ఫైళ్ల వ్యవహారం బయటకు వస్తే ఎవరి కొంప మునుగుతుందో అన్న భయం అటు అధికారులు, ఇటు కొందరు గుత్తేదారుల్లో కన్పిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో నూతన కమిషనర్ పెండింగ్ ఫైళ్లను పూర్తి స్థాయిలో పరిశీలించి బోగస్ బహిర్గతమయ్యేలా చర్యలు చేపడతారా.? లేక ఒత్తిళ్లకు జడిసి గత అధికారుల మాదిరే మౌనంగా ఉంటారా అన్న సందేహాన్ని గుత్తేదారులు వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ఫైళ్ల వ్యవహారంలో వాస్తవాలను బయటకు తీయాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

కొలిక్కిరాని కంప్యూటర్ల సమస్య

కార్పొరేషన్‌లో కంప్యూటర్ల సమస్య కొలిక్కి రావడం లేదు. కంప్యూటర్ల కొనుగోలులో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుధారాణి ఆఫీసు నిర్వహణ అధికారి డిఈఈ దాక్షాయిని కంపెనీ కొటేషన్లను తగ్గించి రెండు దపాలుగా టెండర్లు నిర్వహించినా ఒక్క గుత్తేదారు కూడా ముందుకు రాలేదు. నూతన కమిషనర్ మేఘస్వరూప్ బాధ్యతలు చేపట్టిన మరుసటి రోజే రెండోసారి కంప్యూటర్ల కొనుగోలుకు మరో టెండర్ నోటీసు ఇచ్చారు. కంపెనీ రేట్లు తగ్గించి నిర్వహించిన టెండర్లలో పాల్గొని నష్టపోవటం ఇష్టం లేక కాంట్రాక్టర్లు ముఖం చాటేశారు. అధికారుల నిర్వాకంతో ఇంజినీరింగ్ అధికారులు కంప్యూటర్లు లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రభావం నగరంలో అభివద్ధి పనులపై పడుతోంది. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నిర్వాకంతో నాలుగు నెలలుగా మున్సిపల్ కార్పొరేషన్‌లో కంప్యూటర్ సామగ్రి టెండర్ల ప్రక్రియ ఒక అడుగు కూడా ముందుకు పడనట్లు తెలుస్తోంది. ఈ సమస్యపై సకాలంలో అటు పాత కమిషనర్ భాగ్యలక్ష్మి గానీ, నూతన కమిషనర్ మేఘ స్వరూప్ గానీ పూర్తి స్థాయిలో స్పందించలేదన్న విమర్శలు ఉన్నాయి.

దేశవ్యాప్త గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పామిడి

ఈ నెల 16వ తేదీ దేశవ్యాప్తంగా చేపడుతున్న గ్రామీణ బంద్‌ను మండల వ్యాప్తంగా జయ ప్రదం చేయాలని రైతు, కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. స్థానిక వ్యవసాయ కార్మిక భవనంలో బుధ వారం ఎర్రిస్వామి అధ్యక్షతన ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఇతర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఎపి రైతు సంఘం మండల గౌరవాధ్యక్షులు అనిమిరెడ్డి, సిపి ఎం మండల కార్యదర్శి మల్లేష్ మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు, రూ. 2 లక్షల రైతు రుణమాఫీ, రుణ విముక్తి, ఆహార భద్రత చట్టాలు, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, నిర్వాసితులకు పూర్తి పునరావాసం కల్పించాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, సాగుదారులకు పట్టాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ మంజూరు, కరువు సహాయక చర్యలు చేపట్టాలని, రైతుల మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించరాదన్నారు. భూ హక్కుల చట్టం, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. సమావేశంలో నాగరాజు, బాబా ఫకృద్దీన్, వెంకటయ్య, శంకర, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల ఎపి రైతు సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా అనిమిరెడ్డి, అధ్యక్షులు గా ఎర్రిస్వామి, ఉపాధ్యక్షులుగా ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శిగా ముత్యాలు, సహాయ కార్యదర్శిగా చంద్రమోహన్‌రెడ్డి, సభ్యులుగా నారాయణరెడ్డిలను ఎన్నుకున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రైతు, వ్య.కా.సం. నాయకులు

మహిళా సాధికారతే సిఎం జగన్ లక్ష్యం : మెట్టు

ప్రజాశక్తి-గుమ్మఘట్ట

మహిళా సాధికారతే లక్ష్యంగా సిఎం జగన్ పాలన చేస్తున్నారని రాయదుర్గం నియోజక వర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర హైస్కూల్ ఆవరణలో బుధవారం డిఆర్‌డిఎ ఐకెపి ఆధ్వర్యంలో నాల్గో విడత ఆసరా పథకం ద్వారా మహిళలకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, మెట్టు గోవిందరెడ్డి హాజరయ్యారు. మెట్టు మాట్లాడుతూ మండలంలోని 685 మహిళా సంఘాల్లోని 6,932 మంది సభ్యులకు రూ. 3.02 కోట్ల చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆసరా, ప్రభుత్వం నుంచి మేలు పొందిన మహిళలు 2024 ఎన్నికల్లో వైసిపిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి భవాని, మండల కన్వీనర్ కాంత్‌రెడ్డి, వైస్ ఎంపిపి రామకృష్ణారెడ్డి, జడ్పిటిసి మహేష్, డీఎస్పీ శ్రీనివాసులు, ఎంపిడిఒ గౌరీదేవి, తహశీల్దార్ వెంకటేశ్వర్లు, సిఐ శ్రీనివాసు లు, ఎస్ఐ వెంకటేశ్వర్లు, డిఆర్‌డిఎ ఏరియా కోఆర్డి నేటర్ గంగాధర్, మండల సమైక్య అధ్యక్షురాలు లక్ష్మీదేవి, ఎంపిటిసి ఓబుళ కాంతమ్మ, సర్పంచులు కెవి దొడ్డి రమేష్, కోట్ల ఉమేష్‌రెడ్డి, నాయకులు పాటిల్ ప్రతాపరెడ్డి, అనంత రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, ఖాజా హుస్సేన్, పల్లకిరెడ్డి, వీరభద్రరెడ్డి, రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే కాపు, మాజీ ఎమ్మెల్యే మెట్టు

రైతుల నడ్డి విరిచిన జగన్ ప్రభుత్వం : ఉన్నం

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

రైతు ప్రభుత్వమని చెప్పుకుంటూ రాష్ట్రంలో రైతాంగం నడ్డి విరుస్తున్న జగన్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉన్నం హనుమంతరాయచౌదరి పిలుపునిచ్చారు. మండలంలోని బుడిమేపల్లి గ్రామంలో బుధవారం 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఆయన ముందుగా మహిళలకు చీర, పసుపు, కుంకుమ అందజేశారు. అనంతరం ఉన్నం వరలక్ష్మి ప్రతి ఇంటికీ వెళ్లి మినీ మేనిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. హనుమంత రాయచౌదరి మాట్లాడుతూ చంద్రబాబు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, రాయితీతో డ్రిప్పులు, స్ప్రింక్లర్లు అందించగా జగన్ ప్రభుత్వం అవేవీ ఇవ్వకపోగా ఉన్న వాటిని తొలగించిందన్నారు. టిడిపి అధికారం లోకి వచ్చిన వెంటనే వాటన్నింటినీ తిరిగి రైతులకు ఇస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు సుబాన్, రాజశేఖర్‌గౌడ, విరుపాక్షిరెడ్డి, తిమ్మప్పచౌదరి, దండు సత్యనారాయణ, హనుమంతప్ప, ముప్పలకుంట చిత్తప్ప, సర్పంచి సందీప్, నాగిరెడ్డి, బసవేశ్వరగౌడ, లింగన్న, రామదాసు, మోహన్, మారుతి, సిద్దేశ్, సునీల్, ముద్దుల రామాంజిని, రామ్మూర్తి, తిమ్మప్ప, మారెన్న, హంపక్క, మేకప్పగారి రాము, మహిళలు వందలాది మంది పాల్గొన్నారు.

భవిష్యత్తుకు గ్యారెంటీ పత్రాలు విడుదల చేస్తున్న హనుమంతరాయ చౌదరి

ఆలయ ప్రహరీ, పుష్కరిణి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయ ఆవరణలో రూ. 4.15 కోట్ల వ్యయంతో చేపడుతున్న ప్రహరీ, పుష్కరిణి పనులకు బుధవారం ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి భూమిపూజ చేసి నామఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పలుమార్లు టిటిడి ఛైర్మన్, దేవాదాయ శాఖ అధికారులకు చేసిన విజ్ఞప్తి మేరకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి అధ్యక్షులు గౌని పాలాక్షిరెడ్డి, కార్యనిర్వహణ అధికారి నరసింహారెడ్డి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్‌పర్సన్ కాపు భారతి, నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, కౌన్సిలర్ గోవిందరాజులు, పాలకమండలి సభ్యులు ఆర్.సత్య నారాయణ, ఉమాపతి, వైసిపి పట్టణ కన్వీనర్ శివప్ప, సుబ్రహ్మణ్యం, ఎస్ఎల్‌వి రాధాకృష్ణ, కాపు ప్రవీణ్‌రెడ్డి,కాంట్రాక్టర్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నామఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి

సంక్షేమం, అభివృద్ధే వైసిపి లక్ష్యం

ప్రజాశక్తి-శింగనమల

సంక్షేమం, అభివృద్ధే వైసిపి లక్ష్యమని నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఎం.వీరాంజనేయులు పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైసిపిని ఆదరించాలని కోరారు. ఆయన బుధవారం మండలంలోని పెరవలి, జూలాకాలువ, జలాలపురం, కొరివిపల్లి, సలకంచెరువు, సోదనపల్లి గ్రామాల్లో వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులను కలిసి పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా పని చేద్దామన్నారు. అందరికీ అందుబాటులో ఉంటా గెలిపించాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. తండ్రి బాటలో నడుస్తూ ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలన్నీ అమలు చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. సంక్షేమం, అభివృద్ధి మళ్లీ రావాలి అంటే వైసిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి యోగేశ్వరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలను ఓట్లు అభ్యర్థిస్తున్న వీరాంజనేయులు

మౌలిక వసతులు కల్పించాలని వినతి

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న వారికి ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించాలని సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహశీల్దార్ ఆంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య మాట్లాడుతూ మండలంలో 1998-2000 మధ్యకాలంలో దాదాపు 94 కుటుంబాలు కు.ని. ఆపరేషన్లు చేయించుకోగా అప్పటి ప్రభుత్వం అక్కన్నపల్లి గ్రామ రెవెన్యూ భూమిలో 2 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించిందన్నారు. అయితే మౌలిక వసతులు కల్పించకపోవడంతో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోని కారణంగా ఖాళీ స్థలాలను కొందరు రాజకీయ నాయకులు కబ్జా చేస్తున్నారని వాపోయారు. కావున ఇళ్ల స్థలాలు వారికే చెందేలా చర్యలు తీసుకోవడంతో పాటు అక్కడ రోడ్లు, విద్యుత్, నీరు, తదితర మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిచో సిపిఐ, ఎపి వ్య.కా.సం. ఆధ్వర్యంలో బాధితులతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి నాగరంగ య్య, ఎపి వ్య.కా.సం. నాయకులు నారాయణరెడ్డి, రామాంజనేయులు, సూరి, విశ్వనాథ్, రామలక్ష్మి, వరాలు, బాధితులు జయమ్మ, మంగమ్మ పాల్గొన్నారు.

భోగేశ్వరాలయంలో వసంత పంచమి పూజలు

ప్రజాశక్తి-పామిడి

వసంత పంచమి సందర్భంగా బుధవారం పట్టణంలో వెలసిన భోగేశ్వరస్వామి ఆల యంలో ప్రధాన అర్చకులు రాముస్వామి ఆధ్వర్యంలో సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. సరస్వతి అమ్మవారికి అభిషేకం, అర్చన చేశారు. అనంతరం బాలలకు విద్యాభ్యాసం ప్రారంభ సూచికగా కొత్త పలకపై అక్షరాలు రాయించారు. ఆయన మాట్లాడుతూ ఆయుధాలు ధరించని శక్తి స్వరూపిణి సరస్వతి సకల విద్యలకు ఆది దేవత అన్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రణాళికతో అనంత అభివృద్ధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అనంతపురం

నియోజకవర్గంలో నాలుగున్నరేళ్లలో రూ. 1,045 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం.. ఇంకా కొన్ని పనులు చేయాల్సి ఉంది.. రానున్న రోజుల్లో ప్రణాళికాబద్ధంగా పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. నగరంలోని 50వ డివిజన్ 68వ సచివాలయం ఆవరణలో నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ స్వయం సహాయక మహిళా పొదుపు సంఘాల సమావేశ భవనాన్ని బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. 'మీ క్షేమం కోరే వాళ్లు కావాలో? దోపిడీదారులు కావాలో' వచ్చే ఎన్నికల్లో మీరే నిర్ణయించుకోవాల న్నారు. మీ ఇంట్లో మంచి జరిగింటే మాకు ఓటు వేయాలని అడిగే దమ్మున్న నాయకుడు జగన్ అన్నారు. మంచి చేస్తుంటే ఓర్వలేని ప్రతిపక్షాలు కేవలం జగన్‌ను గద్దె దించడమే లక్ష్యంగా పని చేస్తున్నాయని విమర్శించారు. భవిష్యత్‌లో మహిళా సంఘాల కోసం అన్ని ప్రాంతాల్లో కమ్యూనిటీ భవనాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం శాంతి నగర్ సర్కిల్ నుంచి తపోవనం వరకూ జరుగుతున్న రోడ్డు పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రభుత్వ అంధుల ఆశ్రమాన్ని సందర్శించి భోజనం, ఇతర సదుపాయాలపై ఆరా తీశారు. ఎమ్మెల్యే వెంట నగర మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్లు శేఖర్‌బాబు, టీవీ చంద్రమోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, నాయకులు రామచంద్ర, బిందుప్రియ ఉన్నారు.

ఇంటింటికీ వైసిపి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనంత, నాయకులు

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. నగరంలోని 42వ డివిజన్‌లో బుధవారం 'ఇంటింటికీ వైసిపి' నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో సైతం ప్రజలకు అండగా నిలిచామన్నారు. నగరంలో ప్రధాన రహదారులే కాదు, అంతర్గత రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం పనులు పెద్దఎత్తున చేపట్టామన్నారు. టిడిపి పాలనలో మాటలకే పరిమితం కాగా నేడు చేతల్లో చూపిస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో మరోమారు వైసిపి అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు.

బహుమతి అందుకుంటున్న విద్యార్థిని ప్రణవ్య

'అనంత బాలోత్సవం'లో సంసిద్ విద్యార్థినికి ప్రథమ బహుమతి

అనంతపురం : 'అనంత బాలోత్సవం-2024' పోటీల్లో నగరంలోని సంసిద్ పాఠశాల విద్యార్థిని మొదటి స్థానంలో నిలిచింది. పోటీల్లో భాగంగా పద్యం-భావం చెప్పడంలో 9వ తరగతి విద్యార్థిని ప్రణవ్యకు మొదటి బహుమతి, ప్రీతిరెడ్డికి కన్సోలేషన్ బహుమతి దక్కింది. వీరిని సిఇఒ ఇందూ సానో, ప్రిన్సిపల్ శ్రీవాణి అభినందించారు.

అశ్వర్థంలో హుండీ లెక్కింపు

పెద్దపప్పూరు : మండలంలోని అశ్వత్థనారాయణస్వామి ఆలయ హుండీలను బుధవారం లెక్కించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి వారం శాశ్వత హుండీల ద్వారా రూ. 1,82,870, తాత్కాలిక హుండీల ద్వారా రూ. 3,31,115 ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఇఒ సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఎస్ఎస్‌బిఎన్ కళాశాలలో బ్లాక్ డే

అనంతపురం : నగరంలోని ఎస్‌-ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ ఆధ్వర్యంలో బుధవారం బ్లాక్ డే నిర్వహించారు. 2019-ఫిబ్రవరి-14వ తేదీ పుల్వామాలో జరిగిన ఉగ్రదాడిలో 40 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారన్నారు. ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాలలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డా. నగరూరు రసూల్, ఎన్ఎస్ఎస్ క్యాడెట్స్ అభి, సాంబ, మునీశ్వర్, నారాయణస్వామి, తేజ, నరేంద్ర, హేమ, గౌతమి, లిఖిత, అంకిత పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో హరిత ప్రతిభ

గుత్తి : మండలంలోని అబ్బేదొడ్డి గ్రామానికి చెందిన నీలి హరిత జేఈఈ మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. గోపాల్‌రెడ్డి, నారాయణమ్మ దంపతుల కుమార్తె హరిత విజయవాడలోని ఓ ప్రయివేట్ కళాశాలలో ఇంటర్ ఎంపిసి ద్వితీయ సంవత్సరం చదువు తోంది. ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 98.75 మార్కులు సాధించిన హరితను పలువురు అభినందించారు.

ఎస్సీల అభ్యున్నతికి పాటుపడతా

గుమ్మఘట్ట : మండలంలోని తాళ్లకెర గ్రామానికి చెందిన మల్లెల వెంకటేష్‌ను అనంతపురం టిడిపి పార్లమెంటు ఎస్సీ విభాగం కార్య నిర్వాహక కార్యదర్శిగా నియమించారు. అలాగే ఓబుళాపురం గ్రామానికి చెందిన ఎన్.వెంకటేష్ లను ఎస్సీ విభాగంలో అధికార ప్రతినిధిగా ఎన్నుకున్నారు. తన ఎన్నికకు సహకరించిన టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులుకు మల్లెల వెంకటేష్ ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకం వమ్ము కాకుండా బాధ్యతలను నిర్వర్తించి ఎస్సీల అభ్యున్నతికి పాటుపడతానని తెలిపారు.

సేవాఘడ్‌లో ఉచిత వైద్య శిబిరం

శింగనమల : నారాయణ ట్రస్ట్ సౌజన్యంతో జనరల్ సర్జన్ డాక్టర్ రమణనాయక్, ఫిజీషియన్ డాక్టర్ రఘురాం ఆధ్వర్యంలో సేవాఘడ్‌లో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో సేవాలాల్ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి బంజారాలు దాదాపు లక్ష మందికి పైగా భక్తులు వచ్చి దర్శించుకుంటారన్నారు. వీరిని దృష్టిలో ఉంచుకొని డాక్టర్ రమణానాయక్ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిబిరంలో ట్రస్ట్ సభ్యులు జనార్ధన్‌నాయక్, టిటిడి సభ్యులు అశ్వర్థనాయక్, కేశవనాయక్, రవీంద్రనాయక్ పాల్గొన్నారు.

శిబిరంలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ రమణానాయక్

సంఘమిత్ర కాలనీలో ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తున్న జనసేన నాయకులు

ట్యాంకర్లతో తాగునీరు సరఫరా

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని సంఘమిత్ర కాలనీలో పది రోజులుగా తాగునీటి ఎద్దడి నెలకొనడంతో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్ ట్యాంకర్ల ద్వారా ఉచితంగా తాగునీరు అందజేశారు. సంఘమిత్ర కాలనీ వాసులు హెల్ప్ లైన్‌కు ఫోన్ చేసి సమస్య తెలుపగా వెంటనే స్పందించిన వరుణ్ సమస్యను పరిష్కరించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అంకె ఈశ్వరయ్య, నగర ఉపాధ్యక్షులు సదానందం, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మర నాగేంద్ర, కార్యదర్శులు రాపా ధనుంజయ్, కిరణ్‌కుమార్, సిద్ధు, ఆవుకు విజయకుమార్, ముప్పూరి కృష్ణ, నగర ప్రధాన కార్యదర్శి మేదర వెంకటేష్, హుస్సేన్, నగర కార్యదర్శులు కుమ్మర మురళి, అంజి, సంపత్, వల్లంశెట్టి రమణ, ఆకుల అశోక్, నాయకులు విజయ్, ఉదయ్, నౌషాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న వీరాంజనేయులు

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

స్థానిక సొసైటీ కార్యాలయం ఆవరణలో బుధవారం వైసిపి నాయకులు రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఎం.వీరాంజనేయులు హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం ఆర్డీటీ బధిరుల పాఠశాలలో విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్స్, స్కేల్స్, వాటర్ బాటిల్స్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ సాంబశివారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారన్నారు. నాయకులు మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి శ్రేయస్సు కోరుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, సాంబశివారెడ్డి నియోజకవర్గానికి రెండు కళ్లు లాంటివార న్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి భాస్కర్, నాయకులు ఆలూరు రమణారెడ్డి, ఎంపిటిసిలు వెంకట శివారెడ్డి, వాలంటీర్లు శివ, కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న జెఎసి నాయకులు

జెఎసి ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన

గుత్తి : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి కార్యాచరణ సమితి(ఎపి జెఎసి) ఆధ్వర్యంలో బుధవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. నాయకులు కె.శ్రీనివాసులు, షేక్షావలి మాట్లాడుతూ ప్రభుత్వం 12వ పీఆర్సీని వెంటనే ప్రకటించాల న్నారు. బకాయి డిఎలు, సరెండర్ లీవులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ తక్షణమే జమ చేయాలని, లేనిచో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు దేశాయి నాగరాజు, సయ్యద్‌బాషా, దేవ దాసు, లోకేష్, ఇమామ్ హుస్సేన్, చాంద్‌బాషా, రాజగోపాల్, చంద్రశేఖర్, సికె. రామాంజ నేయులు, కృష్ణభగవాన్ పాల్గొన్నారు.

డ్రైవర్లకు అవగాహన

రాయదుర్గం : రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలో వాహన డ్రైవర్లు, ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంవిఐ విశ్వనాథరెడ్డి రోడ్డు భద్రతా నిబంధనలు, జాగ్రత్తలను వివరించారు. నిబంధనలు పాటించకపోతే రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు బాధితులను ఇన్సూరెన్స్ వర్తించదన్నారు. ఆటోలు, వాణిజ్య వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికు లను, ఓవర్ లోడ్‌ను తరలించరాదన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఫిట్నెస్ సర్టిఫికెట్, ట్యాక్స్, పర్మిట్, తదితర పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు.

నేడు పంపనూరులో ప్రత్యేకపూజలు

ఆత్మకూరు : మండలంలోని పంపనూరు గ్రామంలో వెలసిన శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో మాఘ షష్ఠి పర్వదినం పురస్కరించుకుని గురువారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఇఒ తెలిపారు. ఉదయం 9 నుంచి సర్పసూక్త పాలాభిషేకం, పంచామృతాభిషేకం, బంగారు కవచ అలంకారం, 10 నుంచి శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కళ్యాణోత్సవం, మధ్యాహ్నం 12-30 గంటలకు మహానైవేద్యం, మహామంగళహారతి, తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

రథసప్తమి వేడుకలకు మాజీ ఎమ్మెల్యేకు ఆహ్వానం

ఉరవకొండ : మండలంలోని బూదగవి గ్రామంలో వెలసిన సూర్యనారాయణస్వామి దేవస్థానం లో ఈ నెల 16వ తేదీ జరిగే రథసప్తమి వేడుకలకు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డిని బూదగవి గ్రామస్తులు, వైసిపి నాయకులు ఆహ్వానించారు. అనంతపురంలోని విశ్వేశ్వరరెడ్డి నివాసంలో ఎంపిపి నరసింహులు, నాయకులు ధనుంజయ, రామాంజనేయులు, ఎర్రిస్వామి, లింగన్న, తదితరులు కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

గుత్తి : మండలంలోని కరిడికొండ గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై బుధవారం వేకువ జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. పోలీసుల వివరాల మేరకు.. బుక్కరాయసముద్రంకు చెందిన సాలార్‌బాషా(46) తన ఆటోలో పాత సామాన్లు వేసుకొని బయల్దేరాడు. కరిడికొండ గ్రామం వద్ద రహదారి పక్కన ఆటో నిలిపి రోడ్డు అటు వైపు ఉన్న హోటల్‌కి వెళ్లి భోజనం చేశాడు. అనంతరం రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి అనంతపురం వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో సాలార్‌బాషాతో పాటు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న హెచ్‌సిఎల్ కంపెనీలో పనిచేస్తున్న సాఫ్ట్ వేర్ ఇంజినీర్ భువనచంద్ర(25) అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

స్కూల్ బస్సుకు తప్పిన ప్రమాదం

ఉరవకొండ : మండలంలోని షెక్షానుపల్లి వద్ద బుధవారం ఎవిఆర్ ప్రయివేట్ పాఠశాల బస్సుకు తృటిలో ప్రమాదం తప్పింది. జరుట్లరాంపురం నుంచి ఉరవకొండ వైపు వెళ్తున్న బస్సు స్టీరింగ్ రాడ్ విరిగిపోవడంతో పక్కకు వెళ్లి ఓ వైపు ఒరిగింది. దీంతో ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. మిగతా వారంతా క్షేమంగా ఉన్నారు. ప్రమాద సమయంలో బస్సులో 30 మందికి పైగా విద్యార్థులు ఉన్నట్టు తెలుస్తోంది. విషయం తెలిసిన వెంటనే కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకొని యాజమాన్యంతో వాగ్వాదానికి దిగారు. బస్సులను పూర్తిస్థాయిలో పరీక్షించి సరైన బస్సులను ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఆర్‌టిఒ తీరుపై ఆగ్రహం

ఎవిఆర్ పాఠశాల బస్సు ప్రమాదానికి గురైన విషయం తెలిసినా గుంతకల్లు ఆర్‌టిఒ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితులను పరిశీలించకపోవడం పట్ల ఎస్సీ ఎస్టీ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ మండిపడ్డారు. దీనిపై విచారించగా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రయివేట్ బస్సుల నాణ్యతను పరిశీలించి జాగ్రత్తలు తీసుకొని పక్షంలో ఆర్‌టిఒ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాము, శివకృష్ణ, భీమేష్, హారుణ్ రషీద్, రామాంజ నేయులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

శింగనమల : మండల కేంద్రమైన శింగనమలలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచా రం అందడంతో బుధవారం ఎస్ఐ చంద్రశేఖర్ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ దగ్గర అనంత హరికృష్ణ లక్ష్మీనారాయణను అరెస్టు చేసి మద్యం సీజ్ చేసి కేసు నమోదు చేశారు. మండలంలో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి 'దండు' పరామర్శ

శింగనమల : మండలంలోని పెద్దమట్లగొంది గ్రామానికి చెందిన దండు సాయి భార్య నాగేశ్వరమ్మ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. విషయం తెలిసిన వెంటనే తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు అనంతపురంలోని ప్రభుత్వాసుపత్రికి వెళ్లి నాగేశ్వరమ్మ మృతదేహాన్ని సందర్శించి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట దాసరి గంగాధర్, దండు సతీష్ రాయల్, దాసరి వెంకటరమణ, దండు ప్రకాష్, మునేంద్ర ఉన్నారు.

పాఠశాలల్లో ఘనంగా వసంత పంచమి వేడుకలు

అనంతపురం : స్థానిక విన్సెంట్ ఫెర్రర్‌నగర్‌లోని శ్రీషిరిడీసాయి మోక్షిత్ స్కూల్‌లో బుధవారం వసంత పంచమి, అక్షరాభ్యాసం వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ముందుగా సరస్వతీదేవి పూజ చేసి చిన్నారుల చేత అక్షరాభ్యాసం చేయించారు. కరస్పాండెంట్ కె.సుబ్బారెడ్డి వసంత పంచమి విశిష్టతను తెలిపారు. హెచ్ఎం వై.లక్ష్మీసుబ్బారెడ్డి పదో తరగతి విద్యార్థుల చేత ప్రత్యేక పూజలు చేయించారు. చిన్నారులకు ప్రసాదం, మిఠాయిలు పంచిపెట్టారు.

బెళుగుప్ప : స్థానిక సన్‌రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం పంచమి(వసంత పంచమి) వేడుకలను ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ మారెన్న ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు పాఠశాల యాజమా న్యం సహకారంతో ఎస్ఐ శివ, మండల వైద్యాధికారి డాక్టర్ కార్తీకుమార్ రెడ్డి, కరస్పాండెంట్ మారెన్న ఉచితంగా పలకలు, పూజాసామగ్రి అందజేశారు. ఎస్ఐ శివ, కరస్పాండెంట్ మారెన్న చిన్నారుల చేత అక్షరాలు దిద్దించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ వెంకటరమణ, ఉపాధ్యాయ బృందం సంధ్య, శైలజ, రషీద, అఖిలాబాను, గౌతమి, మమత, రోజా, ఎం.శైలజ, ఇందుప్రియ, ఎర్రిస్వామి, నిత్య ప్రకాష్ పాల్గొన్నారు.

ఉరవకొండ : వసంత పంచమి పురస్కరించుకుని స్థానిక ఎవిఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సరస్వతిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ విక్రమ్, చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అనంతపురం : నగరంలోని కోర్టు రోడ్డు శ్రీచైతన్య పాఠశాలలో వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎజిఎం సుబ్బారెడ్డి వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. కొందరు విద్యార్థుల చేత ఆయన పాఠశాల ఆవరణలో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ తబస్సుం, వైస్ ప్రిన్సిపాల్ బాలకృష్ణ, అకడమిక్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఎఒ గోపాల్, డీన్‌లు సిరాజుద్దీన్, అప్పలనాయుడు, మహేష్, ప్రైమరీ ఇన్‌ఛార్జి నీరజ భారతి, తేజస్విని, ప్రైమరీ కోఆర్డినేటర్ పూజ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య పాఠశాలలో చిన్నారి చేత అక్షరాలు దిద్దిస్తున్న ఎజిఎం సుబ్బారెడ్డి

రాయదుర్గం : పట్టణంలోని సరస్వతి శిశు మందిరంలో బుధవారం పాఠశాల కమిటీ అధ్యక్షులు పొరాలు ధనార్జున, హెచ్ఎం రాజేశ్వరి ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. 90 మంది చిన్నారుల చేత అక్షరాభ్యాసం చేయించారు. పాఠశాల సమితి కార్యదర్శి సోమ నీలకంఠ వసంత పంచమి విశిష్టతను, అక్షరాభ్యాసం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి తుకారం, కోశాధికారి సాంబమూర్తి, సమితి సభ్యులు గంగాధర్, నాగభూషణ్, ఉపాధ్యా యులు చంద్రకళ, చిదానంద పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు కల్పించండి

పుట్లూరు : కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని ఎంపిడిఒ దస్తగిరి ఫీల్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ప్రజలకు ఉపాధి పనులు కల్పించాలన్నారు. అందుకు సంబంధించిన ఎస్టిమేట్లు వేయాలని టెక్నికల్ అసిస్టెంట్లకు సూచించారు. సమావేశంలో ఎపిఒ చెన్నకేశవులు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త కనిపించకూడదు : మున్సిపల్ కమిషనర్

అనంతపురం కార్పొరేషన్ : నగరంలో ఎక్కడా రోడ్లపై చెత్త కనిపించకూడదని నగరపాలక సంస్థ కమిషనర్ మేఘాస్వరూప్ పారిశుధ్య కార్మికులను హెచ్చరించారు. కమిషనర్ బుధవారం 1వ పారిశుధ్య సర్కిల్‌లో కార్మికుల మస్టర్‌ను తనిఖీ చేశారు. నగరంలోని 2, 3, 5వ రోడ్డు, ఆజాద్‌నగర్, లక్ష్మినగర్, కోవూరు నగర్, తదితర వీధుల్లో పర్యటించి పారిశుధ్యం నిర్వహణ విధానాన్ని పరిశీలించి సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు చేశారు. ప్రతి కార్మికుడు చేతి తొడుగులు ధరించేలా చూడాలని శానిటరీ కార్యదర్శులను ఆదేశించారు. చెత్త సేకరణతో పాటు ఆయా డివిజన్లలో మురుగునీటి పారుదల వ్యవస్థను పరిశీలించారు. కార్మికులు సమయపాలన పాటించాలని సూచించారు.

పారిశుధ్య కార్మికుల మస్టర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్